క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు, చాపాడు మండలాల్లో శనివారం మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయా సబ్ స్టేషన్ల విద్యుత్ అధికారులు తెలిపారు. మైదుకూరు సబ్ స్టేషన్లలోని కృష్ణాపురం ఫీడర్, నంద్యాలంపేట సబ్‌స్టేషన్‌లలోని గాంధీనగర్ ఫీడర్, చాపాడు సబ్‌స్టేషన్‌లోని చాపాడు, చియ్యపాడు ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ డైరెక్టర్‌గా వుట్టి శారద



ప్రొద్దుటూరు కల్చరల్ : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం నందవరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన వుట్టి శారద ఎంపికయ్యారు. 2025 నుంచి 2027 సంవత్సరాలను గాను ఈమె ఆలయ డైరెక్టర్‌గా పదవిలో కొనసాగనున్నారు. ఈమె భర్త వుట్టి నాగశయనం దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా సేవలందిస్తున్నారు. ఈయన 2020-22, 2022-24 వరకు నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ డైరెక్టర్‌గా రెండు పర్యాయాలు సేలందించి ఆలయాభివృద్ధికి కృషి చేశారు.

భోజన సామగ్రి అందజేత



విద్యార్థులకు పంపిణీ చేసిన భోజన సామగ్రి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు శుక్రవారం పంపిణీ చేశారు. లో ఆర్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రఘురాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్ఎస్ ఫౌండేషన్ ఎంతగానో దోహదపడుతున్నట్లు ఆయన తెలిపారు. డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ ఆర్ఎస్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కనీస అవసరాలు తీరుస్తూ అనాథ పిల్లల కోసం అండగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో యర్రంరెడ్డి, ప్రభాకర్, సిద్దు, రామచంద్రయ్య, తేజస్విని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సేవలందేలా చూడండి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని 50 పడకల ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ సభ్యులు అన్వర్ కోరారు. పోరుమామిళ్లలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని రెండో పెద్ద పట్టణమైన పోరుమామిళ్లలో కేవలం 5 లేదా 6 మంది డాక్టర్లతో నెట్టుకొస్తున్న పరిస్థితి ఉందన్నారు. దాదాపు 12 నుంచి 15 మంది డాక్టర్ల అవసరముందని, రోజూ 200 నుంచి 300 మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారని తె8లిపారు. వెంటనే వైద్యులు, ల్యాబ్ సిబ్బందిని నియమించి ఆసుపత్రిలో సేవలు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

నేపాల్‌లో చిక్కుకున్న వారిని స్వదేశానికి తీసుకురావాలి

కలసపాడు : నేపాల్‌లోని ఖాట్మండులో చిక్కుకున్న 45 మందిని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని మాజీ ప్రభుత్వ సలహాదారు పోలిరెడ్డినాగార్జునరెడ్డి కోరారు. పోరుమామిళ్లలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నేపాల్‌లో జరుగుతున్న అల్లర్లలో రాయలసీమ వాసులు 45 మంది చిక్కుకున్నారని, నాలుగు రోజులుగా భయకంపితులై ప్రాణాలు అరచేత పట్టుకొని జీవిస్తున్నారన్నారు. తెలుగువారిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.

గంగిరెడ్డిపల్లెలో ఉచిత వైద్య శిబిరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌లింగారెడ్డి

బి.కోడూరు : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని కడప డివిజన్ ఇన్‌చార్జి ఉప సంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్ర ప్రదేశ్ పశు సంవర్ధక శాఖ, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 42 పశువులు, 37 దూడలకు ఏలికపాముల మందు తాగించి మినరల్ బ్లాక్స్, పశువుల యజమానులకు ఎముకల పొడి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌లింగారెడ్డి మాట్లాడుతూ పశువులలో లింగ నిర్ధారిత వీర్యం వల్ల ఉపయోగాలుంటాయని తెలిపారు. కడప డీఏల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ రైతు రూ.150 చెల్లిస్తే ప్రభుత్వం లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోందన్నారు. ఈ శిబిరంలో బి.మఠం సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, పశు వైద్యాధికారులు డాక్టర్ హేమలత, డాక్టర్ స్నిగ్ధప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్టకు భారీగా వరద నీరు



రాజుపాళెం మండలంలోని వెల్లాల పాతవంతెనపై పారుతున్న నీరు



రాజుపాళెం: రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న వరద నీరు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు నీరు భారీగా వస్తోంది. దీంతో రాజోలి ఆనకట్ట నీటితో జలకళ సంతరించుకుంది. శుక్రవారం వరదనీరు ఎక్కువగా రావడంతో వెల్లాల సమీపంలోని పాతవంతెనపై నీరు పారుతోంది. రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి గురువారం 13258 క్యూసెక్కులు పోగా శుక్రవారం 25382 క్యూసెక్కుల నీరు పోతుందని, అలాగే ప్రధాన కాలువకు 630, కేసీ చాపాడు కాలువకు 90 క్యూసెక్కులు నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు.

వంతెనపై రాకపోకలు ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు : సగిలేరు నది వద్ద వంతెనపై వాహన రాకపోకలతోపాటు కాలినడకన ప్రయాణం చేయవద్దని స్థానిక ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. సగిలేరు నదిపై వేమలూరు వద్ద ఉన్న లో లెవెల్ వంతెనపై శుక్రవారం సుమారు మూడు అడుగుల మేర సోమశిల వెనుక జలాలు చేరాయ ఎస్ఐ తెలిపారు. ఎవరూ వంతెన దాటే ప్రయత్నం చేయకూడదని, అలా చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని చెప్పారు. ముత్తుకూరు, వేమలూరు, కామసముద్రం, మాడపూరు, కమలకూరు పంచాయతీల ప్రజలు వంతెనపై రాకపోకలు చేయరాదన్నారు. బద్వేల్ మీదుగా వెళ్లి పనులు చేసుకోవాలని మండల ప్రజలను కోరారు.

ఎట్టకేలకు ఎగ్జిబిషన్ టెండర్

ప్రొద్దుటూరు : దసరా పండుగ సందర్భంగా అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఉదయం వేలం పాట వాయిదా పడటంతో తిరిగి మధ్యాహ్నం వేలం పాట నిర్వహించారు. మొత్తం 8 మంది కాంట్రాక్టర్లు ఇందులో పాల్గొన్నారు. అత్యధికంగా కాంట్రాక్టర్ ఎస్‌వీ శివకుమార్ రూ.1,91,44,000 పాట పాడి దక్కించుకున్నారు. జీఎస్టీతో కలిపి కాంట్రాక్టర్ రూ.2,25,89,920 చెల్లించాల్సి ఉంది. మరో వైపు సీల్డ్ టెండర్‌ను రూ.1.76 కోట్లకు సాకే పెద్ది రాజు కోడ్ చేశారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం అత్యధిక మొత్తంలో పాట పాడిన ఎస్‌వీ శివకుమార్‌కు ఎగ్జిబిషన్‌ను నిర్వహణను అప్పగించారు. ఈ వేలం పాటను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం అన్యాయం

ఖాజీపేట : మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం కూటమి ప్రభుత్వం పేదలకు చేస్తున్న తీరని అన్యాయం అని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి అన్నారు. ఖాజీపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి ముందు చూపు కారణంగా మన రాష్ట్రంకు 17 మెడికల్ కాలేజీలు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 5 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన కాలేజీలు కూడా కూటమి ప్రభుత్వం నిర్మాంచాలన్నారు. అలా కాకుండా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతే పేదలకు ఉచితంగా అందాల్సిన వైద్యం అందదన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ పేదల తరుపున పోరాటం చేస్తుందన్నారు.

నేడు చక్కర వ్యాధికి ఉచితంగా పరీక్షలు

బ్రహ్మంగారిమఠం : స్థానిక నాలుగురోడ్ల కూడలిలో శనివారం ఉదయం 7 గంటలనుంచి 12 గంటలవరుకు అపోలో ఫార్మసిస్ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్ వ్యాధికి పరీక్షలు, మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల కోసం పొడగడుపున రావాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయితేజ

కలసపాడు : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాయితేజ, డాక్టర్ శైలజ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఏఎన్ఎంలతో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాల బారిన పడకుండా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ లార్వాసర్వే చేయాలన్నారు. అబేట్ ద్రావణం, బ్లీచింగ్ చల్లించాలని, దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. సమావేశంలో రామతీర్థం, హేమవతి, జ్యోతి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్, డీఏలను వెంటనే ప్రకటించాలి

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్, ఏడీలను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చాపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని అలాగే మరికొన్ని డిమాండ్లతో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ చాపాడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుందూనది వద్దకు వెళ్లద్దు



రాజుపాళెం: వెల్లాల పాత వంతెన వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

రాజుపాళెం : కుందూలో వరద నీరు ఎక్కువగా పారుతోందని, ఏఒక్కరూ కూడా అక్కడకు వెళ్లవద్దని ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆయన శుక్రవారం వెల్లాల పాత వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కుందూ నదిలో వరద నీరు అధికంగా వస్తోందన్నారు. నదిలో ప్రవహిస్తున్న నీటిని చూసేందుకు వెళ్లొద్దని.. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. పంట పొలాలకు వెళ్లే రైతులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆయా గ్రామాల పరిధిలో నది వద్దకు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే వెల్లాల పాతవంతెనపై నీరు పారుతుండటంతో కంప అడ్డంగా వేశారని, ఆదారిలో వెళ్లే బస్సులు, లారీలు, సుమోలు, ద్విచక్ర వాహనాలు బైపాస్ రహదారిలో వెళ్లాలని సూచించారు.

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : నియోజకవర్గ కేంద్రమైన బద్వేల్ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కె.జకరయ్య అన్నారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు, పట్టణ పరిధిలో జాతీయ రహదారి ఉండడం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండడం వంటి కారణాలతో ట్రాఫిక్ పెరిగిపోతోందన్నారు. పట్టణ జనాభా పెరిగిన నేపథ్యంలో వివిధ రకాల పనుల నిమిత్తం ప్రజలు తమ వాహనాలలో వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలు, ఆటో స్టాండ్లు, సులబ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో అనిల్, నారాయణ, చంద్రపాల్, రామరాజు, బాబు, విజయరావు, జయరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వెంటనే ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని తెలిపారు. 2024 జనవరి నుంచి నాలుగు విడతల డీఏలను ప్రకటించాలన్నారు. ఉద్యోగుల అన్ని రకాల బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, జిల్లా కౌన్సిలర్లు అప్పర్‌పాషా, నరసింహాకుమార్, సురేష్, రామసుధాకర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, పుల్లారెడ్డి, నాగరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలి



ఉపాధ్యాయురాలు సుధా పరిమళను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మైదుకూరు : ఉపాధ్యాయులు విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ పద్మలత అన్నారు. మండలంలోని లెక్కలవారిపల్లె ప్రాథమిక పాఠశాల నుండి డయాన్‌ఖాన్‌పల్లెకు బదిలీ అయిన ఉపాధ్యాయురాలు సుధా పరిమళను శుక్రవారం పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ సుధా పరిమళ లెక్కలవారిపల్లె పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచారని అభినందించారు. బోధనలో అంకిత భావం చూపి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రభుత్వ సత్కారాన్ని పొందారని గుర్తు చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయురాలు సుధాపరిమళను ఎంఈఓలు, పాఠశాల హెచ్‌ఎం లలిత కుమారి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 నరహరి శర్మ, ఎస్టీయూ నాయకులు పాలకొండయ్య, మల్లేశ్వర రెడ్డి, రాజు, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, నారాయణ ప్రసాద్, ఉపాధ్యాయినులు భారతి, నీలావతి, శ్రీదేవి, పద్మజ, అపర్ణ, ఇందిర, రిటైర్డ్ టీచర్ వీరలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి



డ్రైడే ఫ్రైడే గురించి వివరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్ : ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడేగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత సూచించారు. మండలంలోని నాగాయపల్లె గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను పటిష్టంగా చేపట్టాలన్నారు. చాలా రోజులుగా జ్వరం వస్తున్నా, అత్యవసర కేసులను వెంటనే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో వాటర్ పైపు లైన్ లీకేజీ వల్ల కలుషిత నీరు తాగి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, దానిని మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రజలు వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు యశోద, జాస్మిన్, హేమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కోసం ఇబ్బందులు



చాపాడు : ప్రైవేట్ దుకాణం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు



రాజుపాళెంలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

చాపాడు : యూరియా కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.350-380 చెల్లిస్తున్నా యూరియా బస్తా రైతులకు దొరకడం కష్టంగా మారింది. ఇదే తంతుగా భావిస్తున్న ప్రైవేట్ దుకాణా వ్యాపారులు రూ.350-380 వరకు ఇష్టం వచ్చిన వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. యూరియా బస్తా కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాపాడులోని ఓ ప్రైవేట్ దుకాణంలో బస్తా రూ.350- 400లతో అమ్మకాలు చేయగా రైతులు నుంచి ఫిర్యాదులు పోవడంతో అధికారులు పంపిణీ నిలుపుదలు చేశారు. సోమాపురం రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తారని రైతులు ఉదయం నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేయడంతో వ్యవసాయ అధికారి దేవి పద్మలత పరిస్థితి చక్కదిద్ది యూరియా పంపిణీ చేశారు.

యూరియా కష్టాలు

రాజుపాళెం : యూరియా కోసం రైతులంతా క్యూ కట్టిన సంఘటన రాజుపాళెం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని కొర్రపాడు, టంగుటూరు, రాజుపాళెంలోని మనగ్రోమోర్, కృషి ఆగ్రో ఫర్టిలైజర్స్ వద్ద మండల వ్యవసాయాధికారి శివరామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టోకన్లను పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. టంగుటూరు, రాజుపాళెం గ్రామాల్లో యూరియా పంపిణీ వద్ద రైతులంతా గొడవలు చేస్తున్నారని తెలియడంతో ఎస్ఐ వెంకటరమణ అక్కడకు వెళ్లి పరిస్థితిని అదుపు చేశారు.

అక్షరాస్యతతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

మైదుకూరు : ప్రతి ఒక్కరికి అక్షరాస్యతతోపాటు సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు జీవన నైపుణ్యాలతోపాటు వృత్తి నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏవీ రమణయ్య, ఉపాధ్యక్షుడు ఖాజా హుస్సేన్, మ్యాజిక్ కన్వీనర్ హరేరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



బద్వేలు : సీతారాం ఏచూరి చిత్రపటవ వద్ద నాయకుల నివాళి



అట్లూరు : సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పోరుమామిళ్లలో



కలసపాడులో సీతారాం ఏచూరికి నివాళి

బద్వేలు అర్బన్ : సీతారాం ఏచూరి జీవితాన్ని నేటి తరం కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం పేదల ప్రజల పక్షాన దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహించిన పోరాటయోధుడు సీతారాం ఏచూరి అని అన్నారు. మతతత్వ, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో క్రమం తప్పకుండా ప్రశ్నించిన పార్లమెంటరీ నేత ఏచూరి అన్నారు. సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అ కార్యక్రమంలో చిన్ని, శివ, సుబ్బరాయుడు, అనంతమ్మ, శాఖ కార్యదర్శులు బాలమ్మ, మస్తాన్, ప్రసాద్, కొండయ్య, వెంకటపతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సీతారాం ఏచూరి

అట్లూరు : ఆదర్శనీయుడు సీతారం ఏచూరి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.చాంద్‌బాషా, మండల కార్యదర్శి రమణయ్య తెలిపారు. అట్లూరు సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దేశవ్యాప్తంగా అనేక పోరాటాలను నిర్వహించిన నేత సీతారాం ఏచూరి అని తెలిపారు. దేశంలో వామపక్ష మేధావుల్లో సీతారం ఏచూరి ఒకరని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దుర్గమ్మ, స్వప్న, సరస్వతి, ఆదిలక్షుమ్మ, రవిచంద్ర, గోపయ్య, రామసుబ్బయ్య, మారయ్య, జీవన్ కుమార్, వెంకటసుబ్బమ్మ, గంగాదేవి, మునెమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని వీరుడు సీతారాం ఏచూరి

పోరుమామిళ్ల : అలుపెరగని వీరుడు సీతారాం ఏచూరి అని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.భైరవ ప్రసాద్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భైరవ ప్రసాద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి అలుపెరగని ఎర్రజెండా వీరుడన్నారు. ఆయన ఆశయ సాధన కోసం సీపీఎం కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీబీ, రవి, బాబు, చిన్నయ్య, గురయ్య, రమణయ్య, రాజశేఖర్, వలి, సాయి, వెంకటమ్మ దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శం

కలసపాడు : సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గురయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో సీతారాం ఏచూరి చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరి అన్నారు. అణగారిన వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాడిన గొప్ప మహనీయుడు ఏచూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగూర్‌వల్లి, హుస్సేన్‌పీరా, నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.